

రాంచందర్‌ను సన్మానిస్తున్న మహేశ్, సత్యనారాయణ తదితరులు

రాంచందర్‌కు శుభాకాంక్షలు

మన్సూరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమితుడైన వడ్డేపల్లి రాంచందర్‌ను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సదరన్ రీజియన్ చైర్మన్ ఆదర్ల మహేశ్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా రాష్ట్రాల్లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగ నియామకాల్లో ఎస్సీలకు జరుగుతున్న అన్యాయాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని రాంచందర్‌ను కోరినట్లు మహేశ్, సత్యనారాయణ తెలిపారు. రిజర్వేషన్ల అమలు, రిస్టోర్ విధానాన్ని సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. బండ్లగూడలోని జీఎస్ఐని సందర్శించాలని కోరినట్లు తెలిపారు. ఆనంద్‌కుమార్, లింగ్య, ఆర్.అరుణ్‌కుమార్, ఎస్టీ బాబు, విటల్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణ

రజక సొసైటీలకు నిధులు విడుదల చేయాలి

మన్సూరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రజక ఫెడరేషన్ ద్వారా రజక వృత్తిదారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ పేర్కొన్నారు. శ్రీబాబా రజక సహకార సంఘం సమావేశం నాయకుడు బొడ్డుపల్లి మధు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన కృష్ణ మాట్లాడుతూ రజక ఫెడరేషన్‌కు చైర్మన్, కమిటీని నియమించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రజక సొసైటీలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీబాబా రజక సహకార సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా బొడ్డుపల్లి సహదేవ్, ప్రధాన కార్యదర్శిగా బొడ్డుపల్లి మధులను ఎన్నుకున్నారు. ఇద్దరు డైరెక్టర్లతో పాటు 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

వెంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం

ఎల్‌బీనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గండు ధనంరెడ్డి ఎన్నికయ్యారు. అసోసియేషన్ భవనంలో ఎన్నికల అధికారి శాంతిప్రసాద్ సమక్షంలో జరిగిన ఎన్నికల్లో సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధనంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మరోజు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పీవీఎస్ ప్రసాద్, కోశాధికారిగా ఎస్‌వీఎస్ సాయికిరణ్, సంయుక్త కార్యదర్శులుగా పి. మధుసూదన్‌రెడ్డి, బోడ శంకర్, సాంస్కృతిక కార్యదర్శిగా రామొగ్గల విజయకుమార్, నిర్వాహక కార్యదర్శిగా బంగారు సందీప్ ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీవాసులకు అధ్యక్షుడు ధనంరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

31న రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికలు

చాదర్‌ఘాట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ 2024-2027 సంవత్సర కాలానికి నూతన కార్యవర్గానికి ఎన్నికలు ఈనెల 31న నిర్వహించనున్నట్లు సెక్రెటరీ జనరల్ వినయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న అసోసియేషన్ కార్యవర్గం కాలపరిమితి ఈనెల 31న ముగియనున్నందున బైలాస్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని కార్యవర్గం తీర్మానించిందని వివరించారు. కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీవీ హన్మంత్‌రావును ఎన్నికల అధికారిగా నియమించారు. ఈమేరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

రంగారెడ్డి కోర్టులు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. సోమవారం ప్రారంభమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఈనెల 20 సాయంత్రం 5గంటల వరకు కొనసాగనుంది. 21న నామినేషన్ల పరిశీలన, 22న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అనంతరం అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. 28న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల 30 నిమిషాల వరకు పోలింగ్ జరుగనున్నది. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న గుర్రం సుధాకర్‌రెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న లక్ష్మణ్ తెలిపారు.

30న సామూహిక ఉపనయనములు

వనస్థలిపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ వనస్థలిపురం ఆధ్వర్యంలో ఈనెల 30న బ్రాహ్మణ వటువులకు సామూహిక ఉపనయనములు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పోచంపల్లి శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. వనస్థలిపురం గురుద్వార్ పక్కన ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించే సామూహిక ఉపనయనములను విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్9848224586, 9652236673, 6302454218లను సంప్రదించాలన్నారు.



స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

వనస్థలిపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకుని రాణించాలని భాష్యం పబ్లిక్ స్కూల్ జోనల్ ఇన్‌చార్జి అంకమరావు అన్నారు. సోమవారం వనస్థలిపురంలోని భాష్యం స్కూల్లో నిర్వహించిన స్పోర్ట్స్ డేలో పలు బ్రాంచీలకు చెందిన భాష్యం విద్యార్థులు పరేడ్ నిర్వహించి తమ ప్రతిభను కనబర్చారు. క్రీడల్లో విజేతగా నిలిచిన వనస్థలిపురం బ్రాంచి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మన్సూరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాగోల్ వాసులు మహేశ్, కోటయ్యలు నాగోల్ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నాగోల్ గ్రామ పెద్దలు బద్దం సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. తొమ్మిదేళ్లుగా మహేశ్, కోటయ్యలు వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బద్దం నరేందర్‌గౌడ్, ఉమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏకశిల పదునెట్టాంబడి..

రేపటి నుంచి 24 వరకు

వార్షిక బ్రహ్మోత్సవాలు



ఆలయంలో నిత్యపూజలందుకుంటున్న అయ్యప్పస్వామి



ఆలయంలోని ఏకశిల పదునెట్టాంబడి (బంగారు మెట్లు)



విద్యుత్ కాంతుల్లో హరిహరక్షేత్ర అయ్యప్ప ఆలయం

చంపాపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ సాగర్ రింగ్‌రోడ్ బైరామల్‌గూడ, డిఫెన్స్‌కాలనీలోని హరిహరక్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 20నుంచి 24వరకు 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. జగద్గురు హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులతో వార్షిక బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. 20న ఉదయం లక్ష్మీగణపతి సహిత నవగ్రహ హోమం, 21న వల్లి దేవసేన సమేత రమాలక్ష్మి అమ్మవార్ల ధ్వజస్తంభానికి ధాన్యదివాస కార్యక్రమం, మహా మృత్యుంజయ పాశుపత హోమం, 22న వల్లి దేవసేన సమేత రమాలక్ష్మి అమ్మవార్లకు ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ, 23న మహా సుదర్శన హోమం, 24న విజయ చాముండి(చండీ)హోమం, సాయంత్రం చాముండేశ్వరి గురుదత్తపీఠం వ్యవస్థాపకులు కొడగండ్ల శ్రీరామశరణశర్మ గురూజీ బ్రహ్మత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు రంజిత్ తాంత్రి, రమణ గురుస్వామి, రాఘవేందర్‌రావు దేశ్‌పాండే పర్యవేక్షణలో ఏకశిలా నిర్మితం పదునెట్టాంబడి మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు.

దాతల సహకారంతో ఆలయం



దాతల సహకారంతో హరిహర క్షేత్రం అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మించాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయంలో సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఆలయంలో అయ్యప్పస్వామితో పాటు ఇతర ఉప ఆలయాలను నిర్మించాం. అయ్యప్పస్వామి భక్తులకు నిత్యం అన్నదానం ఏర్పాటు చేస్తున్నాం. దాతలు, ధర్మకర్తల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. ఆలయ అభివృద్ధి కోసం దాతలు మరింత సహకరించాలి. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి. వార్షిక బ్రహ్మోత్సవాలలో హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామితో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొననున్నారు.

- వంగా మధుసూదన్‌రెడ్డి, చంపాపేట డివిజన్ కార్పొరేటర్, ఆలయ వ్యవస్థాపకులు



వీఎంహోంలోని పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు



దివ్యాంగ విద్యార్థిని కేంద్రంలోకి తీసుకెళ్తున్న సిబ్బంది



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

హయత్‌నగర్/అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై 12.30 గంటలకు ముగిశాయి. విద్యార్థులు ఉదయం 8.00 గంటలకే ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. 8.30గంటలకు విద్యార్థులను పరీక్ష హాల్‌లోనికి అనుమతించారు. నోటీసు బోర్డులో ఏర్పాటు చేసిన హాల్ టికెట్ నంబర్‌ను చెక్ చేసుకున్నారు. అరగంట ముందుగానే విద్యార్థులను, హాల్ టికెట్‌ను పరిశీలించి సెంటర్‌లోకి పంపించారు. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల విద్యాశాఖ పరిధిలోని 30సెంటర్‌లలో 7241 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.



బోర్డుపై హాల్‌టికెట్ నంబర్లను చూస్తున్న విద్యార్థులు

చంపాపేట, హస్తినాపురంలలో..

చంపాపేట: చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో ఏర్పాటు చేసిన ఆయా పరీక్ష కేంద్రాలలో సోమవారం ఫస్ట్ లాంగ్వేజ్ పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చంపాపేటలోని శ్రీత్రివేణి స్కూల్‌లో 220మంది, కాకతీయ సెంట్రల్ స్కూల్‌లో 220, ఎస్‌టీ మేరీస్ స్కూల్‌లో 142మంది, బ్రిలియంట్ స్కూల్‌లో 141మంది, కర్మన్‌ఘాట్ ఉన్నత పాఠశాలలో 250మంది, డీపీఎస్ స్కూల్‌లో 260మంది, విజ్ఞాన్ స్కూల్‌లో 138మంది, నాగార్జున స్కూల్‌లో 250మంది, న్యూ రాయల్ స్కూల్‌లో 220మంది, శ్రీ సరస్వతి స్కూల్‌లో 163మంది, లోటస్ ల్యాప్ స్కూల్‌లో 151మంది విద్యార్థులు (వంద శాతం)పరీక్షలకు హాజరయ్యారు. లిటిల్ రోజెస్ స్కూల్‌లో 220మందికి 219, చంపాపేట ఉన్నత పాఠశాలలో 240మందికి గాను 239మంది, విద్యాబోధిని స్కూల్‌లో 138మందికి గాను 137మంది హాజరు కాగా హస్తినాపురం డివిజన్‌లోని నవీనా స్కూల్‌లో 250మంది, నాగార్జున మోడల్ స్కూల్‌లో 250మంది(వంద శాతం)పరీక్షలకు హాజరయ్యారు.



విద్యార్థుల హాల్ టికెట్‌లను తనిఖీ చేసి పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తున్న సిబ్బంది

సైదాబాద్‌లో ఆరుగురు గైర్హాజరు

సైదాబాద్: సైదాబాద్ జోన్ పరిధిలోని 22 పరీక్ష కేంద్రాలలో మొత్తం 4823 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 4817 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరు అయినట్లు సైదాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి తిరునగిరి రాధాకృష్ణ తెలిపారు. మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో 15 మంది అంధ బాలికలు సహాయకుల సాయంతో పరీక్షలు రాశారని ఆయన వివరించారు.



రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డిని గండిచెరువు మాజీ సర్పంచ్ జక్క సంజీవరెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీహెచ్ భాస్కర్‌చారి సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వంగేటి లక్ష్మారెడ్డి, కొండల్‌గౌడ్, శేఖర్‌గౌడ్ ఉన్నారు. - అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి



మల్‌రెడ్డి రాంరెడ్డిని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కుకట్లపల్లి సత్యనారాయణ, గడ్డిఅన్నారం కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బద్దుల వేణు యాదవ్, సురేందర్ పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



మల్‌రెడ్డి రాంరెడ్డిని సన్మానిస్తున్న తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు బొర్ర అరుణ్, పార్టీ నాయకులు జైపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌కె జానీపాషా తదితరులు. మల్‌రెడ్డి రాంరెడ్డిని కాంగ్రెస్ నాయకులు దొంతుల సుధాకర్‌రెడ్డి, చైతన్యపురి డివిజన్ మాజీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, బాబుగౌడ్, గోవర్ధన్ కలిసి సన్మానించారు.

- చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

రాష్ట్ర అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్‌దే: లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి

ఎల్‌బీనగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఎల్‌బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం సోమవారం కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు ఎల్‌బీనగర్ ఎలా ఉండేది ఇప్పుడెలా ఉందో బేరీజు వేసుకోవాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ల సహకారంతో సుధీర్‌రెడ్డి నిరంతర పర్యవేక్షణలో ఎల్‌బీనగర్ రూపురేఖలే మారిపోయాయన్నారు. కరోనా సమయంలో అంతటా అభివృద్ధి పనులు నిలిచినా ఇక్కడ మాత్రం ఎమ్మెల్యే చొరవతో వేగంగా సాగాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కొద్ది తేడాతో ప్రభుత్వం మారినప్పటికీ పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. సమావేశంలో ఎల్‌బీనగర్ మాజీ ఇన్‌చార్జి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్‌కుమార్, సామ తిరుమల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చిత్తలూరి వెంకటేశ్వర్లు, రమేష్‌ముదిరాజ్, అనంతుల రాజిరెడ్డి, గజ్జల మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, రాహుల్‌గౌడ్, చిరంజీవి, సత్యంచారి, రాజిరెడ్డి, చింతల రవికుమార్, శ్రీశైలంయాదవ్, మల్లారెడ్డి, ప్రశాంత్, రవిముదిరాజ్ పాల్గొన్నారు.

నేడు వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం

- వేడుకలకు ఆలయం ముస్తాబు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ గ్రామంలోని వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం రుద్రాభిషేకంతో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు గ్రామ తాజా మాజీ సర్పంచ్ బుర్ర వీరస్వామిగౌడ్ తెలిపారు. 19న ఉదయం వీరభద్రస్వామి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి 6గంటలకు వీరభద్రస్వామి కల్యాణం, కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం, ఆలయ ప్రాంగణంలో ఆర్కెస్ట్రా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20వ తేదీ తెల్లవారుజామున 4గంటలకు అగ్నిగుండాలు, స్వామి వారి రథోత్సవం, సేవా ఊరేగింపు ఉంటాయని తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు వీరస్వామిగౌడ్ పేర్కొన్నారు. శివారు గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణ వేడుకలను తిలకించి తీర్థ ప్రసాదములు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.



వీరభద్రస్వామి మూల విగ్రహం

అటెన్షన్.. ఎలక్షన్

(5వ పేజీ తరువాయి)



మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన సువిధ ఫెసిలిటేషన్ సెంటర్, ఎంసీసీ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి సందర్శించారు. ఉల్లంఘన ఫిర్యాదులపై తీసుకునే చర్యలు, కేసుల నమోదు తదితర వివరాలను ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి వారికి వివరించారు. అలాగే, మరో సమావేశంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ ఈనెల 23లోగా ఆయుధాలను ఆయా పోలీస్‌స్టేషన్లలో జమ చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

ఎన్నికల ప్రవర్తన నియామళిని పకడ్బందీగా అమలు చేయాలని హైదరాబాద్, మేడ్చల్ కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, గౌతమ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయనున్న సువిధ సెంటర్, మానిటరింగ్ సెల్ గదులను సోమవారం అనుదీప్ పరిశీలించారు. మేడ్చల్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గౌతమ్ మాట్లాడుతూ ఆదివారం నుంచే ఎన్నికల వ్యయం లెక్కల్లోకి వస్తుందని తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రత: సీపీ తరుణ్ జోషి

లోక్‌సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సిబ్బందిని రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా సోమవారం డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులతో వీడియో సమీక్ష నిర్వహించారు. చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు.

రూ. 1.05 లక్షలు స్వాధీనం

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా నగరవ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ట్రై కమిషనరేట్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో కలిసి చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రెండో రోజు తనిఖీల్లో రూ. 1.05 లక్షల నగదు, రూ. 15.68 లక్షల విలువైన ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ నవీన్‌కుమార్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ వెంకటరమణ, సీఐ ఎస్వీ శేఖర్

వాహనాల తనిఖీ

బోరబండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాంనగర్ చౌరస్తాలో సోమవారం రాత్రి ఎస్సార్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ ఎస్వీ. శేఖర్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ప్రజలు, వాహనదారులు పాటించాలన్నారు. ఈ తనిఖీలు రోజూ వివిధ ప్రాంతాల్లో జరుగుతాయన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

లైంగిక దాడికి పాల్పడిన బాలుడిని శిక్షించాలి

- కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని మూడేండ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన బాలుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంపాపేట డివిజన్‌లోని పవన్‌పురికాలనీలో జరిగిన సంఘటనపై కాలనీ ప్రతినిధులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో పక్కపక్క ఇంట్లో ఉంటున్న బాలికపై ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ వర్గం బాలుడు(13) లైంగిక దాడికి పాల్పడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలలో అద్దెకు వచ్చే వారి వివరాలను పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే వారికి కిరాయిలకు ఇళ్లు ఇవ్వాలని కాలనీ ప్రతినిధులకు సూచించారు. లైంగిక దాడికి పాల్పడిన బాలుడు ఇటీవల మరో బాలుడిపై దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. నేరప్రవృత్తి కల్గిన బాలుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. సమావేశంలో కాలనీ ప్రతినిధులు మాధవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నర్సిరెడ్డి, రమేష్, రమణ, చంద్రారెడ్డి, భూపతిరెడ్డి, నాయకులు గూడూరు అవినాష్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, వీరారెడ్డి, రమేష్‌గౌడ్, దశరథ్‌గౌడ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- నిర్వాహకుడితో సహా పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

కొత్తపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై ఎల్‌బీనగర్ పోలీసులు దాడి చేసి నిర్వాహకుడితో సహా మూడు ముక్కలాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భరత్‌నగర్‌లోని ఓ ఇంట్లో కొంత కాలంగా గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ స్థావరంపై దాడి చేసి నిర్వాహకుడు చవ్వా శ్రీనివాస్(52)ను పేకాట ఆడుతున్న మూసారాంబాగ్‌కు చెందిన కే.శ్రీనివాస్(43), దిల్‌సుఖ్‌నగర్ లలితానగర్‌కు చెందిన ఎస్.శివప్రసాద్(46) భరత్‌నగర్‌లో వాచ్‌మన్‌గా పనిచేసే పీ.విజయ్(38)లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.49,720 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండుకు తరలించారు.